

● ఉట్నూర్ ఐటీడీఏ ముందు ధర్నా చేస్తున్న తుడందెబ్బ నాయకులు, గిరిజనులు

ఆదివాసీల.. పోరుబాట

- 'చలో ఐటీడీఏ' సక్సెస్
- ఉట్నూర్‌కు పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు
- హక్కుల కోసం నిరంతర పోరాటాలు
- వెంటనే ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్
- ఎస్టీ జాబితా నుంచి వలస లంబాడాల తొలగింపునకు పట్టు
- కొత్త ప్రభుత్వం పైనే ఆదివాసీల ఆశలు

ఉట్నూర్, జూన్ 24: 'అడగందే అమ్మ అయిన అన్నం పెట్టదు' అన్న నానుడిని గుర్తు చేసుకుంటూ ఆదివాసీ గిరిజనులు హక్కుల సాధన కోసం పోరుబాట పట్టారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరుకు సై అంటున్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ ముందు తుడందెబ్బ తలపెట్టిన చలో ఐటీడీఏ కార్యక్రమం విజయవంతం అయ్యింది. తుడందెబ్బ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులు ఐటీడీఏ వరకు తరలివచ్చారు. ఆదివాసీల కోసం రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ఫలాలు అందని ద్రాక్షలాగా మారుతున్నాయని ఆరోపించారు. గతంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్దం పాటు ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఏమాత్రం కృషి చేయలేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా అటవీ భూముల్లో సాగు చేస్తున్న గిరిజనులకు హక్కుపత్రాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ ఆదివాసీ గిరిజనుల మనోభావాలను కాపాడాలని గిరిజనులు ఆకాంక్షిస్తున్నారు.

బ్యాగ్‌లాగ్ పోస్టులు ప్రకటించాలి

ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు ఎంతో మంది చదువుకొని నిరుద్యోగులుగా ఉన్నారని.. వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేస్తుంది. టీటీసీ, బీఎడ్, పీజీ, పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత సైతం సాధించి ఉన్నందున స్పెషల్ డీఎస్సీ ఏర్పాటు చేసి ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి!

చట్టబద్ధతలేని లంబాడాలు గిరిజనుల రిజర్వేషన్లు పొందుతున్నారని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ డిమాండ్ చేశారు. 1976లో 108 చట్టం ద్వారా ఎస్టీ జాబితాలో చేర్చబడిన లంబాడాలు అసలైన ఆదివాసీలకు రిజర్వేషన్లు అందకుండా ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని ఉద్యోగ ఉపాధి రాజకీయ ఆర్థిక అవకాశాలను తన్నుకుపోతున్నారని విమర్శించారు. లంబాడీలను తొలగించి, అసలైన గిరిజనులకు మాత్రమే రిజర్వేషన్లు అందించాలని కోరారు.

ఐటీడీఏ మీ కోసమే.. : ఖుష్బుగుప్త, పీవో



ఆదివాసీలతో మాట్లాడుతున్న పీవో

ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ ధర్నా నిర్వహిస్తుండడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ధర్నా శిబిరానికి చేరుకుని గిరిజనులతో మమేకమై కూర్చుండి మాట్లాడారు. ఒకవైపు ఎండ మండిపోతున్నప్పటికీ గిరిజనుల సమస్యలను ఒక్కొక్కటిగా ఓపికగా విన్నారు. 'ఐటీడీఏ మీ కోసం ఉంది.. మీరు ఎప్పుడైనా రావొచ్చు, మిమ్మల్ని ఎవరూ ఆపరు, ఏ సమస్య ఉన్నా.. నేరుగా చెప్పొచ్చు, ధర్నాలు పెట్టి మీరు ఇబ్బందులకు గురికావొద్దు' అంటూ ఆదివాసీ గిరిజనులను, తుడందెబ్బ నాయకులను ఉద్దేశించి పీవో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు పీవోకు వినతిపత్రం అందజేసి.. ఒక్కొక్క సమస్యను విన్నవించారు. మొత్తం సమస్యలను విన్న పీవో తన పరిధిలో ఉన్న వాటిని నాలుగు రోజుల్లోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అలాగే ఐదవ రోజు తుడందెబ్బ ప్రతినిధులు ఒక ఐదుగురు తనను కలవాలని కోరారు. ప్రభుత్వం పరిధిలో ఉన్న సమస్యలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలపడం జరుగుతుందని పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్సా పోచయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గోడం రేణుక, ప్రధాన కార్యదర్శి పుష్పరాణి, ఉమ్మడి జిల్లా తుడందెబ్బ నాయకులు కుడిమెత తిరుపతి, దుందేరావు, భారత్, నైతం రమేష్, కనక ప్రభాకర్, దాదిరావు, సోయం జంగు, సోయం రాందాస్, కుమ్ర శ్యామ్‌రావు, రవీందర్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు. చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ డీఎస్పీ నాగేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. పట్టణం లోని వివిధ ప్రాంతాలలో పికెటింగులు ఏర్పాటు చేయడంతో పాటు ఐటీడీఏ వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్‌లో ఉన్న పీఓవోను రోప్ పార్టీ బందోబస్తు మధ్య ధర్నా శిబిరానికి పోలీసులు తీసుకువచ్చారు. శాంతియుతంగా ఆదివాసీల ధర్నా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ఉట్నూర్‌లోని ఐటీడీఏ వద్ద పోలీసుల బందోబస్తు

ఆదివాసీ ప్రధాన డిమాండ్లు ఇవీ..

1. ఐటీడీఏలో ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి.
2. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి.
3. ఏజెన్సీలో అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలి.
4. జీవో 3ను యథావిధిగా అమలు చేయాలి.
5. ఏజెన్సీ ప్రాంతంలో పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేయాలి
6. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.
7. పెసా చట్టాన్ని రక్షించాలి.

ఏజెన్సీ చట్టాలు నిర్వీర్యం

: పురక బాపూరావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు



ఐదవ షెడ్యూల్లో ఉన్న గిరిజన చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలు నిమ్మకుండి పోతున్నాయని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురకబాపూరావు ఆరోపించారు. వన్ ఆఫ్ సెవెంటీ చట్టం ఏజెన్సీలో అమలు కావడం లేదని, పెస చట్టాన్ని సైతం నిర్వీర్యం చేస్తున్నారని, చట్టాల ఉల్లంఘనపై ఫిర్యాదులు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 317 జీవో వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇతరులు ఉద్యోగాల్లో చేరడంతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పోతున్నాయని అన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి!

: కొడప నగేష్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి



ఉమ్మడి జిల్లాలోని అడవి ప్రాంతాలలో గిరిజనులు సాగు చేసుకుంటున్నా పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ డిమాండ్ చేశారు. పోడు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఫలితంగా అటవి అధికారులు గిరిజనుల పై దాడులకు పూనుకుంటున్నారని విమర్శించారు. పోడు భూములు సాగు చేస్తున్న హక్కు పత్రాలు లేక ప్రభుత్వం సంబంధించి రైతుబంధు సహాయం అందుకోలేక పోతునర్నారని విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు విరాసతులు చేయడంలో కూడా కాలయాపన జరుగుతుండడంతో ఆదివాసీ గిరిజనులు నష్టపోతున్నారని అన్నారు. ఇంద్రవెల్లి స్మారక స్థూపం వద్ద స్మృతి వనం ఏర్పాటు కోసం అదనంగా ఒక ఎకరం స్థలం కొనుగోలు చేసి ఇవ్వాలని అన్నారు.

సంక్షిప్త సమాచారం



మాజీ సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే అనిల్

కేసీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, జూన్ 24: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును సోమవారం ఎర్రవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట గుడిహత్నూర్ మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తిరుమల్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష

మావల, జూన్ 24: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆన్‌లైన్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో తొలిరోజు వంద మందికి 74 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నిమిషం నిబంధన అమలు ఉండటంతో గంట ముందుగానే అభ్యర్థులు కేంద్రానికి చేరుకున్నారు. వారిని సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. కాగా ఈ పరీక్షలు ఐదు రోజుల పాటు జరగనున్నాయని చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావు తెలిపారు.

'ఆ పాఠశాలలకు గుర్తింపు లేదు'

బోథ్, జూన్ 24: బోథ్ మండల కేంద్రంలో ఉన్న వాసవి, విద్యానికేతన్ పాఠశాలకు గుర్తింపు లేదని ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సంవత్సరం ఆ పాఠశాలలో పిల్లలను చేర్పించవద్దని కోరారు. గుర్తింపు లేని పాఠశాలలో విద్యార్థులు చేర్పించినట్లయితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ కన్వీనర్ అక్షయ్

చర్యలు తీసుకోవాలి : ఏబీవీపీ

ఆదిలాబాద్ రూరల్, జూన్ 24: ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల విక్రయాలు, అనుమతి లేని పాఠశా లలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనుమతి లేకుండా నడుస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఏబీవీపీ నాయకులు మహేష్, నిఖిల్, కార్తీక్, విఘ్నేష్, సర్వజిత్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

● ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ● 'గిరిజన దర్బార్'కు తరలివచ్చిన ఆదివాసీలు ● 'ప్రజా ఫిర్యాదుల విభాగం'లో అర్జీలను స్వీకరించిన కలెక్టర్



ఆదివాసీల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బుగుప్త



అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ఉట్నూర్, జూన్ 24: ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగ తిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు.నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామానికి చెందిన స్వాతి తన అటవి హక్కుపత్రం పై పేరు మార్పించమని,ఇంద్రవెల్లి మండలం మార్కగూడ గ్రామానికి చెందిన భీంరావ్ తనకి కిరాణా దుకాణం మంజూరు చేయాలని,ఉట్నూర్ గ్రామానికి చెందిన శశిరేఖ ఏదైనా గురుకుల పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని, నేరడిగొండ మండలం చించోలి గ్రామానికి చెందిన సూర్య మణి మేకల రుణం కావాలని కోరారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్ర జలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ గిరిజన దర్బార్‌లో ఏపీఓ జనరల్ కనక భీంరావ్, డీడీ దిలీప్ కుమార్, జిల్లా అదనపు వైద్యాధికారి కుడిమెత మనోహర్,ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీమ్‌రావు,ఆర్‌సీఓ గంగాధర్, ఏవో సున్నంరాంబాబు, ప్రిన్సిపల్ మేస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్**

ఆదిలాబాద్ అర్బన్: ప్రజాఫిర్యాదుల విభాగంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సూచించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు భూ, సివిల్ కేసులకు సంబంధించి వినతులను కలెక్టరేట్‌లో ఇవ్వవద్దని కలెక్టర్ సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెనువెంటనే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్,ఉట్నూర్ ఆర్డీఓలు వినోద్‌కుమార్, జీవకర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

● **డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్**

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 24: ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు, సూపర్ వైజర్, ఎల్‌హెచ్‌పీలకు సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై శిక్షణ కార్యక్రమంను డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా దోమలు, కలుషిత నీటి వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అందుబాటులో ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కచ్చితంగా పాటించి, పరిసరాల పరిశుభ్రత తాగునీరు, స్వచ్ఛత పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ప్రతి పీహెచ్‌సీలో రాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసి వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.అలసత్వం ప్రదర్శించే సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇందులో జిల్లా మలేరియా అధికారి డా.శ్రీధర్, వైద్యులు సూపర్‌వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పీ, తదితరులు పాల్గొన్నారు.

● **'విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు'**

తలమడుగు: వర్షాకాలం ప్రారంభమైనందున వైద్య సిబ్బంది ఎవరూ కూడా విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధనమనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైద్య శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎవరూ కూడానిర్లక్ష్యం చేయించకుండా సమయ పాలన పాటించి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అదే విధంగా మాతా శిశు మరణాలు అరికట్టేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇందులో డాక్టర్ హరీష్, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్



తలమడుగులో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో



దుర్గావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజనులు

ఘనంగా దుర్గావతి రాణి శౌర్య దినోత్సవం

ఉట్నూర్, జూన్ 24: మండలకేంద్రంలోని గుస్సాడిగుట్టలో గోండ్వాన రాజ్యానికి రాణిగా పరిపాలించి మొఘల్‌చక్రవర్తి అక్బర్‌షాను ఓడించిన ఘనవరాలు రాణి దుర్గావతి శౌర్యదివాస్ కార్యక్రమాన్ని రాజగోండు సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాణి దుర్గావతి పాలనలో ప్రజలు పాడి పంటలు సాగు చేయడానికి పెద్ద రిజర్వేయర్‌లు నిర్మించి తాగునీటిని విడుదల చేసి పంటలు పండించే విధంగా కృషి చేశారన్నారు. అలాగే కళలు, సాహిత్యం, సైనికులు తదితర రంగాల్లో ఆరితేరిన ఆమె చేసిన ఘనతను ప్రస్తుత పాలకులు నేర్చుకో వాల్సిన అవసరం ఎంతో ఉందని రాజ్‌గోండు సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్తి ప్రభాకర్ అన్నారు. మొఘల్ యుద్ధంలో ఎంతో ధైర్యాన్ని శౌర్యాన్ని చూపిన సహసవంతురాలని కొనియాడారు. రాణి దుర్గావతి శౌర్యమును గుర్తించి శౌర్య దినోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పెందోర్ గోపి, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మేస్రం మనోహర్, లక్కారం మాజీ సర్పంచ్ రాంజీగోండు ఆశయ సాధన కమిటి ఛైర్మన్ మర్సకోల తిరుపతి, రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, కోరెంగ సీతారాం, కొయవున్నెం జిల్లా అధ్యక్షులు, సిడాంశేషు, డివిజన్ అధ్యక్షులు, మర్సకోల సరస్వతి, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జూడాల సమ్మె

ఆదిలాబాద్ రూరల్, జూన్ 24: మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన జూడాలు సోమవారం నుంచి సమ్మె చేపట్టారు. అత్యవసర సేవలు మినహా అన్ని విధులను బహిష్కరించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట సమ్మె ప్రారంభించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మె చేపట్టినట్లు జూడాల అధ్యక్షులు సందీప్ చారి పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకట్ నారాయణ

'కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 24: ఆదిలాబాద్ పట్టణంలోని 170 సర్వే నెంబర్ కాలనీలో మౌలిక వసతులను కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ నారాయణ డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కొన్ని ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న ప్రజలకు రోడ్డు, విద్యుత్, నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎర్రజి హరీష్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు దండేకర్ వామన్, నాయకులు పెరిక గంగమ్మ, తారాబాయి, రఫీక్, మనోజ్, తౌఫిక్, రమాకాంత్, వర్షా, రోహిత్, సుఖ్‌దేవ్, ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.





అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

● కుళ్లిపోయిన శవం ● మేనమామ చంపి ఉంటాడని కుటుంబసభ్యుల ఆరోపణ

నేరడిగొండ, జూన్ 24: మండలంలోని గాజిలి గ్రామానికి చెందిన పెందూర్ మహేశ్(19) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ నెల 17 నుంచి కనబడకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టాల ఇండ్లలో ఆరా తీశారు. కాగా సోమవారం ఉదయం గ్రామసమీపంలో గల అడవిలో గుర్తు తెలియని మృతదేహం ఉందనే సమాచారంతో పోలీసులు వెళ్లి చూడ గా శవం కుళ్లిపోయి అడవి జంతువులు పిక్కతినడంతో గుర్తుపట్ట లేనంతగా కుళ్లి పోయింది. గ్రామస్థులు శవం పై ఉన్న బట్టలను చూసి అది పెందూర్ మహేష్‌దేనని గుర్తించడంతో శవ పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వారం క్రితం బోథ్ మం డలం సాంగ్వి పల్లెలో ఉన్న తన మేనమామ ఇంటికి విత్తనాలు వేసేం దుకు వెళ్లి తిరిగి శవమై తేలాడని తల్లి జైతుబాయి ఆరోపించింది. మేన మామ లక్ష్మణ్ ఇంటికి వెళ్లిన కొడుకు శవమై రావడానికి కారణం అతనే అని ఆమె ఆరోపించింది. వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని వేడుకుంది.



గుట్కాను జిల్లాలో సమూలంగా రూపుమాపడమే లక్ష్యం

● ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం ఐపీఎస్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 24:జిల్లాలో గుట్కాను సమూలంగా రూపు మాపుడే లక్ష్యమని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని డైమాండ్ ట్రాన్స్‌పోర్టు గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.41,31,500ల విలువ గల రాష్ట్ర ప్రభుత్వ నిషేదిత గుట్కా లభించిందని తెలిపారు. గుట్కా వ్యాపారం నిర్వహిస్తున్న ఏ1 ఎస్‌కే రహ మతుల్లా, ఏ2 అర్బాజ్‌ఖాన్ (అస్లాంట్రేడర్స్), ఏ3 సైఫుల్లాఖాన్, ఏ4 షమీ ముల్లాఖాన్, ఏ5 పషీవుల్లాఖాన్, ఏ6 సాజిదుల్లాఖాన్‌ల పై ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 261/2024తో ఎస్‌ఈసీ 270,273 ఐపీసీ, 7(1)(20) సిగరేట్ అండ్ టోబాకో యాక్టలతో కేసు నమోదు చేయడం జరిగిందని తెలపారు., గోడౌన్ నుంచి ధరివల్ టోబాకోచ, అన్వర్ టోబాకో, ఆర్‌ఎన్‌ఎక్స్‌ఎల్, 999 షార్ప్, యూకే టోబాకో, తోట టోబాకో, జేకే టోబాకో రాష్ట్ర ప్రభుత్వం నిషేదించిన గుట్కా లభిచిందన్నారు.అలాగే అంబేద్కర్‌చౌక్‌లోని అస్లాం ట్రేడర్స్‌లో ఆకస్మికంగా దాడి నిర్వహించగా దాదాపు 20 రకాల నిషేదించిన గుట్కా లభిచిందని వాటి విలువ రూ.2,87,500 ఉంటుందని తెలిపారు. దీని పై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెంబర్260/2024తో సెక్షన్ 270,273 ఐపీసీ, 7(1)(20) సిగరేట్ అండ్ టోబాకో యాక్టతో ఏ1 అర్బాజ్ ఖాన్ (అస్లాంట్రేడర్స్), ఏ2 సైఫుల్లాఖాన్ అలియాస్ అస్లాం,ఏ3 షమీ ముల్లాఖాన్ అలియాస్ శము,ఏ4 పసివుల్లాఖాన్, ఏ5 సాజి దుల్లాఖాన్‌ల పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కాగా ఈ రెండు కేసులలో మొత్తం రూ.44,19,000 విలువ చేసే నిషేదిత గుట్కా లభించిందని తెలిపారు. జిల్లాలో గుట్కాను సమూలంగా రూపుమాపేంత వరకు ఈ దాడులు నిరంతరంగా కొనసాగుతాయని జిల్లా ఎస్పీ తెలిపారు.

నాటు సారా తయారీదారుడికి రూ.70 వేల జరిమానా

బోథ్, జూన్ 24: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన తయారు చేస్తూ పలుమార్లు అధికారులకు దొరకడంతో ఎక్సైజ్ అధికారులు 70 వేల జరిమానా విధించారు. జాదవ్ రమేష్ ద్వారా జరిమానా రూపంలో చెక్ తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ, ఎం.డి. జూల్ సికర్ అహ్మద్ ఉన్నారు.











లైబ్రరీ ఆవరణలో ధర్నా చేస్తున్న నిరుద్యోగ, డీఎస్సీ అభ్యర్థులు

మెగా డీఎస్సీ వేయాలని ధర్నా

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 24: ప్రమోషన్ల ద్వారా ఏర్పడ్డ ఖాళీలను ఎస్జీటీ, ఎస్ఏల ద్వారా భర్తీ చేయాలని నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థులు అన్నారు. మెగా డీఎస్సీని వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం లైబ్రరీ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పోస్టుల భర్తీకి త్వరగా డీఎస్సీని వేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి డీఎస్సీ వేస్తుందని ఎంతో నమ్మకంతో సన్నద్ధం అవుతున్నామని అభ్యర్థులు తెలిపారు. కానీ ఇప్పుడు గత ప్రభుత్వం 203 పోస్టులు చూపిస్తే ఇప్పటి ప్రభుత్వం 206 కేవలం మూడు పోస్టులను పెంచిందన్నారు. అధికారుల తప్పిదాల వల్ల అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. టెట్ క్వాలిఫై అయిన వారికి సమయం ఇవ్వకుండా డీఎస్సీని వేయడం సరికాదన్నారు. వెంటనే దాన్ని రద్దు చేసి మెగా డీఎస్సీ వేయాలని కోరారు.

'పాఠశాల సమస్యలు పరిష్కరించాలి'

సోనాల, జూన్ 24: సోనాల గ్రామంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు వీడీసీ కార్యవర్గం దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీడీసీ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల సమస్యలను వీడీసీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే.. : డీసీసీబీ చైర్మన్

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

తాంసి, జూన్ 24: ఏక కాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయలు ఆగస్టు 15వ తేదీలోపు ప్రభుత్వం మాఫీ చేసి రైతులకు అండగా నిలుస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం తాంసి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు సంబరాలు నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు టపాసులు కాల్చారు. అనంతరం రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ కౌడాల సంతోష్, వన్నెల నరేష్ కృష్ణారెడ్డి, గడుగు గంగన్న, చిన్నరాములు, మంత్రి గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు



హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు



మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్త

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో

మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలి

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త

ఉట్నూర్, జూన్ 24: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. సోమవారం ఐటీడీఏ పీఓ చాంబర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏటీడీఓలు, జిల్లా క్రీడలు అధికారులు, జీసీడీవోల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. తాగునీరు, స్నానాల గదులు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం తదితర సూక్ష్మ మరమ్మత్తులు వెంటనే చేయాలన్నారు. నాణ్యమైన సరుకులను ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయించాలని జీసీసీ అధికారులను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలను ప్రతి రోజు ఖచ్చితంగా సందర్శించి అక్కడి పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జీసీడీవోలు తప్పనిసరిగా వారంలో ఒక రోజు అయిన రాత్రుల్లో సందర్శించి అవసరమైతే పాఠశాలల్లో నిద్రించాలన్నారు. ఈ సమావేశంలో డీడీలు దిలీప్‌కుమార్, రమాదేవి, డీటీడీఓ మడావి గంగారాం, జీసీసీ డీఎం రామానందం, ఏడీఎంహెచ్ఓ డాక్టర్ కుడిమెత మనోహర్, ఏసీఎంఓలు జగన్, ఉద్దవ్, రాజమౌళి, శివాజి, జిల్లా క్రీడ అధికారులు కోరెడ్డి పార్థసారథి, మీనారెడ్డి, భుక్యరమేష్, బండ జీవరత్నం, జీసీడీఓలు చాయ, శంకుతల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోధ



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

చట్టాలు, ప్రభుత్వ పథకాలపై

మహిళలు అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోద

జైనథ్, జూన్ 24: జిల్లాలోని ఆయా గ్రామాల్లో గల మహిళలు, బాలికలు న్యాయచట్టాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే వివిధ పథకాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. సోమవారం జైనథ్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దీనిలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో, మహిళ చట్టాలు, మహిళలకు బాలికలకు సంబంధించిన పథకాలు, లింగ సమానత్వం, లింగ వివక్షత గురించి ఆమె ఈ సందర్భంగా సమగ్రంగా వివరించారు. అంతేకాకుండా సఖీ కేంద్రం సిబ్బంది కేసు వర్కర్ నాగమణి న్యాయం, వైద్యం, పోలీసు సహాయం సైబర్, టోల్ ఫ్రీ, బాల్య వివాహాలు, వసతి వంటి పలు అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మోడల్ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎండీ జావిద్ అహ్మద్‌లతో పాటు మోడల్‌స్కూల్ విద్యార్థులు లెక్చరర్‌లు పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రయోగశాల గది నిర్మాణానికి భూమిపూజ

ఇచ్చోడ, జూన్, 24: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ప్రయోగశాల గది నిర్మాణానికి సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమి పూజ చేశారు. రూ.13.50 లక్షలతో ప్రయోగశాల నిర్మాణానానికి నిధులు మంజూ రవ్వడంతో పాఠశాల అవరణలో భూమిపూజ చేశారు. అనంతరం విద్యా ర్థులతో ముచ్చటించి పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఎనుగు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు సురేందర్, మహెందర్‌రెడ్డి, సాబీర్, రమేష్, సుభాష్, దీలిప్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 24: ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అనుబంధం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజులు, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధరడే ఛాయా, చంద్రకళ పాల్గొన్నారు.

'ఆంక్షలు లేకుండా పెన్షన్లు ఇవ్వాలి'

బోథ్, జూన్ 24: బీడీ పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వారికి ఎలాంటి ఆంక్షలు లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని బీడీ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని కుచలాపూర్ గ్రామంలో బీడీ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాల పెరుగుదల కార్మికుల విజయమని పేర్కొన్నారు. వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి ఇచ్చేది బీడీ తయారీతోనేనని పేర్కొన్నారు. బీడీ కార్మికులకు సరైన పని లేక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. పరిశ్రమ రోజురోజుకు నిర్వీర్యం అవుతుందని తక్కువ వేతనాలతో పనులు చేయాల్సి వస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులను ఆదుకోవాలని అన్నారు. బీడీ కార్మికులందరికీ లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, ఆడేల్లు సంతోష్, శోభ, ఎం.రాజేందర్, గోదారి బాయ్ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



కుచలాపూర్‌లో మాట్లాడుతున్న బీడీ కార్మికులు, నాయకులు

11కేవీ విద్యుత్‌లైన్ తొలగించాలని వినతి



మాట్లాడుతున్న గ్రామస్థులు

కుభీర్, జూన్ 24 : మండల కేంద్రం కుభీర్‌లోని న్యూ అబాదిలో ఇళ్లపై గల 11కేవీ విద్యుత్‌లైన్ తీగలు తొలగించాలని కోరుతూ సోమవారం గ్రామస్థులు వరంగల్ టీఎస్ఎన్‌పీడీఎస్ చైర్మన్, సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2012 సంవత్స రంలో మే 27వ తేదిన అందరు గాడ నిద్రలో ఉండగా ఉదయం సమ యంలో విద్యుత్ తీగలు పడి 7గురి ఇళ్లపై పూర్తిగా దగ్ధమై, ఒర్జి స్టడీ సర్టిఫికెట్లు కూడా దగ్ధమయ్యాయని వాపోయారు. ఈదురుగాలులకు, వడగాల్పు లకు తీగలు తెగి పడి ఇంకా ప్రమాదాలు జరుగకముందే 11కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సాప పండరి, పోతన్న, ఫారూక్, హన్మండ్లు, రమేష్‌లున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 24 : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు కల్పించినందుకు కృతజ్ఞతగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పీఆర్టీయూ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు వై. సాయన్న, హరిప్రసాద్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీలో చూపించాలి'

నిర్మల్ కల్చరల్, జూన్ 24 : టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ద్వారా ఏర్పడ్డ ఖాళీలను చూపిస్తూ డీఎస్సీ పరీక్ష నిర్వహించాలని డీఈడీ, బీఈడీ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... బదిలీలు, ప్రమోషన్లతో రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల ఖాళీలు ఏర్పడనున్నాయని ప్రతి జిల్లాకు 50 నుండి 300 పోస్టులు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహించాలంటే ఖాళీలు చూపిస్తేనే నెరవేరుతుందన్నారు. తిరుమలేష్, ప్రేమ్‌సాగర్, గజేందర్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రిప్పులు పెంచండి

కుంటాల, జూన్, 24 : భైంసా డిపో నుండి లింబా (బీ) మీదుగా గతంలో ఐదు ట్రిప్పులు బస్సు నడిచేదని, ఆర్టీసీ అధికారులు ఆదాయం తక్కువ రావడం మూలంగా ట్రిప్పులు తగ్గించారని, గత కొద్దిరోజుల నుంచి ఉదయం సాయంత్రం వేళల్లో రెండు ట్రిప్పులు మాత్రమే బస్సు నడుపుతుండగా రాత్రివేళలో ఒక ట్రిప్పు మాత్రమే బస్సు వస్తుందని, మధ్యాహ్నం వేళలో బస్సు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు ట్రిప్పులు పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటర్ పాఠ్య పుస్తకాలొచ్చాయ్



కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చిన పాఠ్యపుస్తకాలు

భైంసా, జూన్ 24 ; ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తోంది. ఇవి కళాశాలలకు చేరుకున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో మొదటి, రెండో సంవత్సరం చదివిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం పుస్తకాలను అందజేసింది. జిల్లాలో 13 ప్రభుత్వ కళాశాలలు ఉండగా మొత్తం 5116 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో మొదటి సంవత్సరం 2648 మంది, రెండో సంవత్సరం 2468 మంది ఉన్నారు. వీరి సంఖ్య ఆధారంగా ప్రస్తుతం మొదటి విడతగా ఆయా కళాశాలలకు పాఠ్య పుస్తకాలు వచ్చాయి. సరఫరా అయిన పాఠ్య పుస్తకాలను ఆయా కళాశాలల్లోని స్టోర్ రూంలు, గ్రంథాలయాల్లో భద్రపరిచారు.

చేరిన తర్వాత పంపిణీ

ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకుని కళాశాలల్లొ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ) అందించగానే వారికి పాఠ్య పుస్తకాలను అందించనున్నారు. ఈ పుస్తకాలు ప్రస్తుతం 13 కళాశాలలకు చేరాయి. ఏ కళాశాలకు చెందిన పాఠ్యపుస్తకాలు ఆ కళాశాల ప్రిన్సిపల్ పంపించిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా నేరుగా వారికి ప్రభుత్వం సరఫరా చేసింది. జూన్ 30 నాటిని అడ్మిషన్లు ముగియగానే మరో మారు విద్యార్థుల సంఖ్యను ప్రభుత్వానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు పంపించనున్నారు. వారి సంఖ్య ఆధారంగా పుస్తకాలను పంపిణీ చేయనుంది. గత సంవత్సరం కంటే ఈ సారి ముందుగానే పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి.

టీసీ అందించగానే పాఠ్యపుస్తకాలు ఇస్తాం

● జాదవ్ పరుషురాం, డీఐఈవో, నిర్మల్

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థులు అడ్మిషన్ పొంది టీసీ అందించగానే వారికి పాఠ్య పుస్తకాలు అందజేస్తాం. మొదటి విడతగా ప్రభుత్వం పుస్తకాలను సరఫరా చేసింది. జూన్ 30 నాటికి ప్రవేశాలు ముగియనున్నాయి. అడ్మిషన్లు పూర్తయిన తర్వాత విద్యార్థుల సంఖ్యను ప్రభుత్వానికి ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ పంపిస్తారు. ఆ వివరాల ఆధారంగా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సరఫరా చేస్తుంది.

● విద్యార్థుల సంఖ్య ఆధారంగా సరఫరా



కుంగిపోయిన వంతెన

● కుంటాల మండలం ఓలా శివారులో డీ 27 కాలువపై అక్విడక్ట్‌తో అవస్థలు



కెనాల్‌పై నిర్మించిన అక్విడక్ట్ కుంగిపోయిన దృశ్యం

కుంటాల, జూన్, 24: కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం... అధికారులు అలసత్వం మూలంగా డీ 27 ప్యాకేజీ పనుల్లో నాణ్యతలేని పనులు కొనసాగుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్మల్ జిల్లాలోని పలు మండలాల గ్రామాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో పలు గ్రామాల మీదుగా కాలువల నిర్మాణాన్ని గత కొద్ది సంవత్సరాల నుంచి చేపడుతున్నారు. కాలువల పై అవసరమున్నచోట రహదారి వద్ద, వ్యవసాయ పనులకు వేళ్లే చోట వంతెనలు సైతం నిర్మిస్తున్నారు. అంతేగాకుండా మరికొన్ని చోట్ల కింద నుంచి కాలువ నీరు ప్రవహిస్తుండగా పై నుంచి పలు కాలువల వరద నీరు సైతం ప్రవహించేందుకు అధికారుల సూచన మేరకు అక్విడక్ట్‌లను కూడా అక్కడక్కడ నిర్మిస్తున్నారు. కుంటాల మండలంలోని ఓలా శివారులో డీ 27 కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా గ్రామ సమీపంలో ఇటీవల అక్విడక్ట్‌ను నిర్మించారు. శని, ఆదివారాల్లో కురిసిన కొద్దపాటి వర్షానికి అది పూర్తిగా కుంగిపోయింది. కొన్ని కాలాల పాటు ఉండవలసిన ఈ అక్విడక్ట్ పనులు పూర్తి కాకుండానే కుంగిపోవడంతో అధికారుల పని ఎంత మేరకు ఉందో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా వేసవి కాలంలో చేపట్టవలసిన పనులను వర్షాకాలంలో ఇష్టారీతిన చేపట్టడం మూలంగా కూడా ఇలాంటి పరిస్థితి నెలకొందని గ్రామస్థులు అంటున్నారు. కాలువపై అక్విడక్ట్ నిర్మాణం సమయంలో సెంట్రింగ్ ఏర్పాటు చేయవలసిన అధికారులు అలాంటిదేమి చేయకుండా మట్టి పోసి లెవల్ చేసి స్లాబ్ వేశారు. ఇటీవల కురిసిన వర్షానికి మట్టి కొట్టుక పోవడంతో స్లాబ్ కుంగిపోయింది. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీ 27 కాలువ నిర్మాణంలో పెండింగ్ పనులను సక్రమంగా కొనసాగేలా చూడాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలి : డీపీవో


కౌటాల, జూన్ 24: రైతులు సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంట దిగుబడి పెరుగుతుందని కుమరం భీం జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన పంటసిరి(సేంద్రియ ఎరువు) విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తప్పకుండా సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. మండలంలోని పంచాయతీ సిబ్బందిచెత్తను వృథా చేయకుండా సేంద్రియ ఎరువును తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, జడ్పీటీసీ అనూష, వైస్ ఎంపీపీ అమ్మక్క, ఎంపీటీసీలు మోతీరాం, శిరీష, ఎం పీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు

పెంచికలపేట, జూన్ 24: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం కొబ్బరిసాగుపై అవ గాహనసదస్సు నిర్వహిస్తున్నట్లు ఏవో రాజుల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరిసాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, రాయితీ, సాగువిధానం గురించి సంబంధిత శాస్త్రవేత్త లతో రైతులకు అవగాహన కల్పిస్తామని రైతులు పాల్గొనిసందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

రైల్వేగేటు రెండు రోజులు మూసివేత

రెబ్బెన, జూన్ 24: మండలంలోని గంగాపూర్ రైల్వే గేటు(నెం.71)ను రెండ్రోజులపాటు మూసివేస్తున్నట్టు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. 3వరైల్వేలైన్ నిర్మాణ పనులు నడుస్తున్నందున ఈనెల25, 26తేదీల్లో ఆసిఫాబాద్-రేపల్లేవాడ స్టేషన్‌మధ్యలో ఉన్నగేటు నెం.71 మూసివేస్తున్నట్టు ప్రకటించారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.



ముంపునకు పరిష్కారం

సోన్ మండలం సాకెర గ్రామ సమీపంలో స్వర్ణవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం ఇదే

- లోతట్టు ప్రాంతాలను కాపాడేందుకు చెక్‌డ్యాంల ఎత్తు తగ్గింపు
- సాకెర వద్ద స్వర్ణవాగుపై రీడిజైన్
- ఫలించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చొరవ
- ముంపు బాధితులకు వరద నుంచి ఊరట

నిర్మల్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన నిర్మల్ పట్టణాన్ని వరద ముంపుబారి నుంచి కాపాడేందుకు సర్కారు కొత్త ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకొని సమస్యను సర్కారు దృష్టికి తీసుకుపోవడంతో ఉన్నతాధికారులు ఈ విషయమై కసరత్తు చేపట్టారు. దీనికి అనుగుణంగా స్వర్ణవాగు ప్రవాహ ఉధృతిని తగ్గించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తం స్వర్ణ వాగుమధ్యలో నీటినిల్వ కోసం నిర్మించిన చెక్‌డ్యాంల తీవ్రతపై అధికారులు కసరత్తు చేశారు. దీనికి అనుగుణంగా ఎక్కడెక్కడ చెక్‌డ్యాంలు ఉన్నాయనే అంశాన్ని వారు పరిగణలోకి తీసుకున్నారు. నిర్మించిన చెక్‌డ్యాంల ఎత్తును లెక్క గట్టి స్వర్ణప్రాజెక్టు నుంచి వరదనీరును అంచనా వేశారు. ప్రాజెక్టు గేట్లను ఎత్తి స్వర్ణవాగు ద్వారా దిగువకు నీరును వదిలినప్పుడు నీటిఉధృతి కారణంగా వాగుకట్టపై నుంచి వరద నీరంతా ఉప్పొంగుతుండడాన్ని అధికారులు నిర్ధారించారు. వరద ప్రవాహాన్ని ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు అడ్డుకుంటున్న కారణంగానే లోతట్టు ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతున్నట్లు వారు నిర్ధారించారు. ప్రధానంగా వాగు నుంచి వరద ప్రవాహం ఉప్పొంగే సమయంలో ఈ చెక్‌డ్యాంలు ఉధృతిని అడ్డుకుంటుండడంతో అవి కట్ట దాటి లోతట్టు ప్రాంతాలను ముంచేస్తున్నాయని అధికారులు భావించారు. ముఖ్యంగా ప్రతీయేటా స్వర్ణ ఉప్పొంగుతున్న కారణంగా మంజులాపూర్, వెంగ్వాపేట్, ఆదర్శనగర్, రాంనగర్, జీఎస్‌ఆర్ కాలనీ, సిద్దాపూర్‌తో పాటు తదితర లోతట్టు ప్రాంతాలన్నీ స్వర్ణవాగు వరదతో మునిగిపోతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం వరద ఉధృతి ఒక్కసారిగా ఇక్కడి జీఎస్‌ఆర్ కాలనీని ముంచేయడంతో ప్రజలంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటకు రాగలిగారు. అధికార యంత్రాంగమంతా వీరిని రక్షించేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలను రప్పించి రాత్రి నుంచి ఉదయం వరకు శ్రమించారు. దాదాపు ఆ కాలనీ వరద బురద నుంచి ఆరునెలల పాటు కోలుకోలేకపోయింది. అలాగే మంజులాపూర్ వద్ద గల జాతీయ రహదారి సైతం నీట మునిగింది. ప్రతీఏటా వర్షకాలంలో స్వర్ణవాగు ఉధృతి కారణంగా లోతట్టు వార్డులన్నీ తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటు గడుపుతున్నాయి.

ఎమ్మెల్యే చొరవతో..


ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సమస్య తీవ్రతను తెలుసుకొని ఆ సమస్య పరిష్కారానికి నడుం బిగించారు. గత నెల రోజుల నుంచి ఆయన ఈ సమస్య పరిష్కారం కోసం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కసరత్తు జరిపారు. పలు దఫాలుగా సమీక్షలు జరిపించిన అనంతరం కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ఈ ప్రతిపాదనను మహేశ్వర్‌రెడ్డి సంబంధిత శాఖ ఉన్నతాధికారుల వద్దకు తీసుకువెళ్లారు. సమస్య తీవ్రతను అధికారులకు వివరించారు. సమస్య పరిష్కారం జరగనట్లయితే దాదాపు పది వార్డులకు పైగా ప్రజలు వరద బారిన పడతారని వారందరినీ రక్షించేందుకు ఇరిగేషన్‌శాఖ రూపొందించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు. ఉన్నతాధికారులు ఎమ్మెల్యే ప్రతిపాదనను పరిగణలోకి తీసుకొని కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.



చెక్‌డ్యాం ఎత్తును తొలగిస్తున్న దృశ్యం

చెక్‌డ్యాం తొలగింపుకు నిర్ణయం

కాగా ఎమ్మెల్యేతో పాటు సంబంధిత ఇరిగేషన్‌శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలపై అధికారులు సీరియస్‌గా కసరత్తు జరిపి స్వర్ణవాగుపై సాకెర వద్ద గల చెక్‌డ్యాంను లక్ష్యంగా చేశారు. ఇక్కడి చెక్‌డ్యాంను మీటర్ వరకు తొలగిస్తే వరద ప్రవాహ ఉధృతిని కొంత మేరకైనా అడ్డుకోవచ్చని నిర్ధారించారు. 2016 సంవత్సరంలో నిర్మించిన ఈ చెక్‌డ్యాంకు రూ.5 కోట్లను వ్యయం చేశారు. ప్రస్తుతం దీని ఎత్తు మూడు మీటర్లుగా ఉండడంతో వరద నీటి ప్రవాహాన్ని ఇది అడ్డుకుంటోంది. నీటిఉధృతిని పెరగడంతో చెక్‌డ్యాం కారణంగా వరద నీరంతా వాగుదాటి లోతట్టు ప్రాంతాలను ముంచేస్తోంది. అయితే చెక్‌డ్యాంను తొలగిస్తే ప్రవాహ ఉధృతిని కొంత మేరకైనా నివారించవచ్చని ప్రవాహం సాఫీగా సాగేందుకు మార్గం సుగమమవుతుందంటూ అధికారులు నిర్ధారించారు. దీంతో సాకెర వద్ద గల చెక్‌డ్యాంను ఒక మీటర్ లోతకు పైగా తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. చెక్‌డ్యాం తొలగింపునకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.



జిల్లా కేంద్రంలోని జీఎస్‌ఆర్ కాలనీ సమీపంలో స్వర్ణవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం ఇదే

ముంపు బాధితులకు వరద నుంచి ఊరట..

కాగా ప్రతియేటా స్వర్ణ వాగు వరద కారణంగా ముంపునకు గురవుతున్న మంజులాపూర్, వెంగ్వాపేట్, ఆదర్శనగర్, జీఎస్‌ఆర్ కాలనీ, సిద్దాపూర్ కాలనీలకు ఊరట లభించబోతోందని అంటున్నారు. సాకెర వద్ద గల చెక్‌డ్యాంను మీటర్‌లోతు వరకు తొలగిస్తే వరద ఉధృతి ప్రవాహం కొంత మేరకు తగ్గుముఖంగా ఉంటుంది. దీంతో ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడబోవని అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే స్వర్ణప్రాజెక్టు గేట్లు ఎత్తిన సమయంలో దిగువకు వదిలే నీటి ద్వారా ఈ వార్డులకు ఎలాంటి ప్రమాదం ఉండదని సంబంధిత అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఖానాపూర్, జూన్ 24 : తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ప్రతీహామీని నెరవేరుస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. సోమవారం ఖానాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత మండల కేంద్రంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ అబ్దుల్‌మోహిద్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకకాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే రైతుల అభివృద్ధి సాధ్యమవుతోందని అన్నారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో గతంలో మూతబడిన ఉర్దూ మీడియం పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను పునఃప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో ఎంపీపీ అబ్దుల్ మోహిద్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు తోట సత్యం, మడిగెల గంగాధర్, కిషోర్‌నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ నర్సయ్య, అమానుల్లా ఖాన్, తదితరులున్నారు.

గృహజ్యోతి మాకెందుకివ్వరు ?

● ఎన్పీడీసీఎల్ డీఈపై కొండాపూర్ గ్రామస్థుల ఆగ్రహం



విద్యుత్ శాఖ అధికారులను నిలదీస్తున్న కొండాపూర్ గ్రామస్థులు

నిర్మల్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని తమ గ్రామానికి ఎందుకు ఇవ్వడం లేదని కొండాపూర్ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రజా వాణిలో తమ సమస్యలపై గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎన్పీడీసీఎల్ డీఈ నాగరాజు, ఏడీఈ లక్ష్మణలను నిలదీశారు. తమ గ్రామంలో సగం మందికి పైగా గృహజ్యోతి పథకం అందడం లేదన్నారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి తమ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులందరికీ గృహజ్యోతి పథకాన్ని అందజేయకపోతే తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి తమ గ్రామస్థులు బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు.

నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎస్పీ



సమస్యలను వింటున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, జూన్ 24 : పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలకు భద్రత కల్పించాలని, శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. ప్రజలు నిర్భయంగా సేవలు వినియోగించుకోవాలని కోరారు. అనుమానాస్పద, అసాంఘిక చర్యలకు పాల్పడేవారి సమాచారాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 87126 59599 నంబర్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

కొత్త చట్టాలపై పోలీసులు అవగాహన పెంచుకోవాలి



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

దిలావర్‌పూర్, జూన్ 24 : పోలీసులు ఎప్పటికప్పుడు కొత్త చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దిలావర్‌పూర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసులు పరేడ్ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ... పోలీసులు విధుల పట్ల నిర్లక్ష్యం విడనాడాలన్నారు. ప్రజలతో స్నేహ పూర్వకంగా ఉంటూనే చట్టాల అమలులో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. చట్టం ఎవరికి చుట్టం కాదని చట్టానికి లోబడి పోలీసులు వ్యవహారాలను చక్కదిద్దాలన్నారు. తప్పు చేసిన వారిని వదల కూడద న్నారు. ఈ సందర్భంగా రికార్డులను, కేసు ఫైళ్లను పరిశీలించారు. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్‌కు పలు సూచనలు చేశారు. డీఎస్పీ వెంట నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బాసర గ్రామం రవీంద్రపూర్ కాలనీ వాసులు

బాసర, జూన్, 24 : బాసర గ్రామ పంచాయతీ పరిధిలో గల రవీంద్రపూర్ ప్రభుత్వ పాఠశాల సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం భైంసాలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కలిసి పరిష్కరించాలని విన్నవించారు. పాఠశాల ఫ్లోరింగ్ మొత్తం శిథిలమైపోయిందని, రోడ్డు విస్తరణ పనుల్లో పాఠశాల ప్రహరీగోడను తొలగించడంతో విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందని, వంట గది లేదని ఇలా పాఠశాల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజావాణికి హాజరైన అధికారులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ టౌన్, జూన్ 24 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్తరేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్‌వో భుజంగ్‌రావు, ఆర్డీవో రత్నకల్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పెన్షనర్ల సంఘం నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 24 : నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్‌ను సోమవారం నిర్మల్ పెన్షనర్ల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్‌కు పూలమొక్కను అందించి అభినందించారు. జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ప్రధాన కార్యదర్శి హనుమంత్ రెడ్డి, పి. విలాస్, జనార్ధన్, తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం కలెక్టర్‌కు వినతి

గత మూడేళ్లుగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు రావలసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయించాలంటూ కాకతీయ ప్రైవేట్ కళాశాల యాజమాన్య సంఘం సోమవారం కలెక్టర్‌కు వినతిచేసింది. ప్రజావాణి సందర్భంగా కలెక్టర్‌ను కలిసి కళాశాలల నిర్వహణ భారంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్య కోసం విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ..

అంగన్‌వాడీలు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ మాట్లాడుతూ.. సమ్మె కాలపు జీతం చెల్లించాలని, రిటైర్డ్ అయిన అంగన్‌వాడీలకు 10, ఆయాలకు 5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీల భర్తీ వేతనం పెంపు తదితర సమస్యలు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఉపాలి, పద్మ కుమారి, రమాదేవి, అర్చన వనమాల, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలి

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఇతర బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐదునెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వేతనాలు, మెనూ చార్జీలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన గ్యాస్‌కు సబ్సిడీ ఇవ్వాలని, గౌరవవేతనం పది వేలు అమలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎండీఎ అధ్యక్షురాలు కే. రాధా, లక్ష్మీ, సత్తెవ్వ, లింగవ్వ, తదితర నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు బీజేపీ నేతల ఆహ్వానం

జిల్లా కేంద్రంలోని ఆర్‌కే ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవానికి హాజరు కావాలని బీజేపీ నాయకులు సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మేధావులు, పట్టణ ప్రజలు హాజరుకావాలని కోరారు. వక్తగా రాష్ట్ర నాయకులు శాంతకుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు.

బాసర గోదావరిలో చొప్పదండి ఎమ్మెల్యే సతీమణి అస్థికల నిమజ్జనం

● అంతిమ సంస్కార కార్యక్రమంలో పాల్గొన్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం



బాసర, జూన్, 24 : చొప్పదండి ఎమ్మెల్యే సత్యం సతీమణ రూప అస్తికలు సోమవారం బాసర వద్ద గోదావరి నదిలో కలిపారు. ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే సత్యం భార్య ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే సత్యంతో పాటు కుటుంబ సభ్యులు అంతిమసంస్కార కార్యక్రమాలను నిర్వహించారు. పిండ ప్రధానం, అస్తికలు స్వయంగా ఎమ్మెల్యే పడవలో వెళ్లి నదిలో కలిపారు. ఎమ్మెల్యే వెంట బాసర మాజీ సర్పంచ్ రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు జంగం రమేష్, కాంగ్రెస్ నాయకులు నరేష్, సతీష్ తదితరులు ఉన్నారు.

ఓలాలో ఒకరి ఆత్మహత్య

కుంటాల, జూన్, 24 : మండలంలోని ఓలా గ్రామానికి చెందిన బొమ్మన ప్రకాష్ (36) అనే యువకుడు సోమవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రజనీకాంత్ తెలిపారు. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు ప్రకాష్ గత కొద్దిరోజుల నుంచి మద్యంకు అలవాటుపడి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డట్లు పేర్కొన్నారు. ప్రకాష్ లెఫ్ట్ పోచంపాడ్ గురుకుల పాఠశాలలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో అక్కడే జీవనం కొనసాగిస్తున్నాడు. ఓలాకు కుటుంబసభ్యులతో వచ్చి గత మూడు రోజుల క్రితం భార్య రీనా, ఇద్దరు కుమార్తెలు లెఫ్ట్ పోచంపాడ్ వెళ్లారు. ప్రకాష్ ఇంటి మరమ్మతులు చేయించి వస్తానని చెప్పి ఇక్కడే ఉండిపోయాడు. అయితే సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

భాగ్యనగర్ కాలనీలో చైర్మన్ పర్యటన



కాలనీలో పర్యటిస్తున్న ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జూన్ 24 : మున్సిపల్ చైర్మన్ జి. ఈశ్వర్ సోమవారం భాగ్యనగర్ కాలనీలో పర్యటించారు. వర్షం కారణంగా రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమస్యలు ఉన్న ప్రాంతాల్లో డ్రైనేజీలోకి నీటిని మళ్లించాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక కౌన్సిలర్ నవనీత సురేందర్ చైర్మన్ వెంట ఉన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

నిర్మల్‌లోని పలు ప్రాంతాల్లో ఇటీవల వీధి కుక్కలు పలువురిని గాయపరిచిన దృష్ట్యా మున్సిపల్ ఆధ్వర్యంలో నివారణ చర్యలు చేపట్టినట్లు చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. సోమవారం పలు ప్రాంతాల్లో కుక్కలను పట్టుకొని వాహనాల్లో తరలించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు.

ప్రజా సమస్యలపై పోరాటం : బీజేపీ

నిర్మల్ పట్టణంలో కోతులు, కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్న మున్సిపాలిటీ పట్టించుకోవడం లేదని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఇటీవల జిల్లా కేంద్రం నాయుడివాడ, బంగల్‌పేట్ ప్రాంతాల్లో వీధి కుక్కల దాడులో పిల్లలు, పెద్దలు గాయపడి ఆసుపత్రి పాలయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వారిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం సమస్యలపై స్పందించి మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల అమ్మకం

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు విక్రయిస్తున్నారని వారిపై చర్య కోరుతూ సోమవారం ఏబీవీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల నుండి ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ శివ కుమార్, దినేష్, జస్వంత్, లక్ష్మణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ కృష్ణ స్థూప ఆవిష్కరణ జయప్రదం చేయండి

ఈ నెల 26న నిజామాబాద్‌లో జరిగే కామ్రేడ్ డీవీ కృష్ణ స్థూప ఆవిష్కరణ జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కే. రాజన్న ఒక ప్రకటనలో కోరారు. కృష్ణ విప్లవోద్యమ నిర్మాణానికి కృషే నేటి విప్లవ తరానికి ఆదర్శప్రాయుడన్నారు. రైతులు, కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.